
పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేటీఆర్, దేశపతి శ్రీనివాస్ తదితరులు

## 'నడక' పుస్తకం ఆవిష్కరణ

జనగామ చౌరస్తా, అక్టోబర్ 1 : జనగామ జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ వ్యాసకర్త ఎర్రోజు శ్రీనివాస్ వివిధ దిన పత్రికల్లో రాసిన వ్యాసాలన్ని కలిపి 'నడక-దశాబ్ది గమనం' పుస్తకాన్ని ఆదివారం హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఈ పుస్తకం ప్రజాస్వామిక, సామరస్య విలువలను ప్రతిబింబించేలా ఉందన్నారు. దశాబ్ద కాల తెలంగాణ, ప్రస్తుత తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని విశ్లేషించిన తీరు అద్భుతంగా ఉందన్నారు. ఇందులో ఉన్న వ్యాసాలన్నీ రాష్ట్ర పునర్నిర్మాణానికి ఉపయోగపడేలా ఉన్నాయని కొనియాడారు. దేశ, రాష్ట్ర సామాజిక స్థితిగతుల వ్యాసాలు కళ్లముందు ఆవిష్కరించే విధంగా ఉన్నాయని తెలిపారు. వ్యాసకర్త ఎర్రోజు శ్రీనివాస్‌ను కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ పుస్తకాన్ని అందరూ చదవాలని, పుస్తకంలోని అంశాలు తెలంగాణ సమాజంలో విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి కేటీఆర్ కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్, ప్రముఖ పాత్రికేయుడు పరాంకుశం వేణుగోపాల స్వామి, సీనియర్ జర్నలిస్టు ఆసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి నుంచి విమానాశ్రయానికి సూపర్ లగ్జరీ సర్వీస్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1: ఆర్టీసీ ప్రయాణికుల కోసం భూపాలపల్లి నుంచి హనుమకొండ మీదుగా రాజీవ్‌గాంధీ విమానాశ్రయం, శంషాబాద్‌కు సూపర్ లగ్జరీ సర్వీసు ప్రారంభించినట్లు ఆర్టీసీ ఆర్‌ఎం జే శ్రీలత తెలిపారు. ఈ సర్వీసు భూపాలపల్లిలో ఉదయం 5 గంటలకు బయల్దేరి హనుమకొండకు 6.30గంటలకు చేరుకుంటుందన్నారు. హనుమకొండలో ఉదయం 7 గంటలకు బయల్దేరి శంషాబాద్ విమానాశ్రయానికి 10:25 గంటలకు చేరుకుంటుందన్నారు. ప్రయాణ చార్జీలు హనుమకొండ నుంచి విమానాశ్రయానికి రూ.530, భూపాలపల్లి నుంచి విమానాశ్రయానికి రూ.640గా నిర్ణయించినట్లు చెప్పారు. ఈ బస్సు మళ్లీ శంషాబాద్ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయల్దేరి హనుమకొండ మీదుగా భూపాలపల్లికి సాయంత్రం 6:05 గంటలకు చేరుకుంటుందన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## బీఆర్‌ఎస్ మండల కోఆర్డినేటర్‌గా ఫిరోజ్

బచ్చన్నపేట, అక్టోబర్ 1 : బీఆర్‌ఎస్ మండల కోఆర్డినేటర్‌గా పోచన్నపేటకు చెందిన ఫిరోజ్‌ను నియమిస్తూ ఆదివారం జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నియామకపు పత్రాన్ని ఫిరోజ్‌కు అందజేశారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఫిరోజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, ఆర్బీఎస్ కోఆర్డినేటర్లు, పీఏసీఎస్ డైరెక్టర్లు, నాయకులతో కలిసి పార్టీని బలోపేతం చేస్తానన్నారు. సహకరించిన ముత్తిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సతీశ్‌రెడ్డికి ఫిరోజ్ కృతజ్ఞతలు తెలిపారు.

## తండ్రికి క్యాన్సర్ వచ్చిందని తనయుడి ఆత్మహత్య

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 1: తన తండ్రికి క్యాన్సర్ అని తెలిసి మనస్తాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఇప్పగూడం గ్రామంలో చోటు చేసుకుంది. ఆదివారం సీఐ సట్ల రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన కొల్లూరి మహేశ్ (44) తండ్రి శ్రీనివాస్ అదే గ్రామంలో ఫర్టిలైజర్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా తన తండ్రి శ్రీనివాస్‌ను ఇటీవల ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు మహేశ్ తండ్రికి క్యాన్సర్ అని, రెండు లేదా మూడు నెలల కంటే ఎక్కువ కాలం బతకడని డాక్టర్లు చెప్పారు. ఈ విషయంపై మహేశ్ మదనపడుతూ ఉండేవాడు. ఆదివారం వారి షాపులోని స్లాబ్‌కు ఉరి వేసుకున్నాడు. మృతుడి తమ్ముడు కొల్లూరి సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## నేడు జీవహింస చేయొద్దు

జనగామ చౌరస్తా, అక్టోబర్ 1 : గాంధీ జయంతి సందర్భంగా సోమవారం చికెన్, మటన్, ఇతర మాంసం విక్రయాలను బంద్ చేయాలని, జీవహింస చేయొద్దని మున్సిపల్ కమిషనర్ జంపాల రజిత కోరారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# వృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలి

- వారి సమస్యలను పరిష్కరిస్తాం
- కలెక్టర్ శశాంక

మహబూబాబాద్, అక్టోబర్ 1 : వృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కలెక్టర్ కే శశాంక సూచించారు. ఆదివారం లెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 33వ ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వృద్ధులు అనడం కన్న పెద్దలు అని గౌరవించాలన్నారు. నేడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ సమాజంలో లేదన్నారు. అలాగని బంధాలు తుంచుకోవద్దన్నారు. నేటి సమాజంలో బంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధుల కోసం ప్రభుత్వం 2007లో చట్టం తీసుకొచ్చిందని, అనంతరం 2011లో నిబంధనలతో అమలుకు నోచుకున్నట్లు తెలిపారు. పెద్దలు అధైర్య పడరాదని, ఎవరి నుంచైనా ఇబ్బందులు ఎదురైతే అధికారులు దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో 47 వేల వృద్ధులకు ఆసరా పింఛన్లు ఇస్తున్నట్లు తెలిపారు. వృద్ధులు భవన నిర్మాణ కోసం నిధులు మంజూరు చేయించుకుంటే స్థలాన్ని తప్పనిసరిగా ఇస్తామన్నారు. వృద్ధులకు ఆస్పత్రులు, బ్యాంకుల్లో ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో 11 లైబ్రరీలు ఉన్నాయని, అదే విధంగా 6 రీడింగ్ రూమ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని చెప్పారు. పోలింగ్ కేంద్రానికి రాలేని వృద్ధులకు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా అవకాశం కల్పిస్తామన్నారు. లక్షన్నర ఓటర్లలో ఆరున్నర వేల పెద్దల ఓట్లు ఉన్నట్లు తెలిపారు. అనంతరం వృద్ధులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, డీఆర్డీవో సన్యాసయ్య, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, విద్యాశాఖ అధికారి రామారావు, మహిళా శిశు సంక్షేమాధికారి వరలక్ష్మి, సఖీ సెంటర్ ప్రతినిధి శ్రావణి, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


వృద్ధులను సన్మానిస్తున్న కలెక్టర్ శశాంక


బీఆర్‌ఎస్‌లో చేరినవారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

## బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ శ్రేణులు

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 1 : మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన బీజేపీ శ్రేణులు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ మేరకు బీజేపీ యువమోర్చా జిల్లా అధికార ప్రతినిధి పుంల్రు నవీన్‌రెడ్డి, కిషన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అక్కిరెడ్డి విద్యాసాగర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు మాచర్ల ఎల్లయ్యతో పాటు 20 మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బెలిదె వెంకన్న ఆధ్వర్యంలో హనుమకొండలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి నివాసంలో పార్టీలో చేరారు. వారికి కడియం శ్రీహరి గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని కోరారు.

**దేవరుప్పలలో..**

దేవరుప్పుల : మన్‌పహాడ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో తొర్రూరు మండల కేంద్రంలో ఆదివారం గులాబీ కండువాలు కప్పుకుని బీఆర్‌ఎస్‌లో చేరారు. సర్పంచ్ వర్రె మధు, మండల యువజన నాయకులు ఏల సుందర్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చింత రవి నేతృత్వంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు వర్రె కుమార్, నిమ్మల మహేశ్ బీఆర్‌ఎస్‌లో చేరారు.

## సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే చర్యలు

**భూపాలపల్లి ఎస్పీ పుల్లా కరుణాకర్**

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 1: సోషల్ మీడియాలో విద్వేషకర, రెచ్చగొట్టే, తప్పుడు పోస్టులు పెట్టవద్దని జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ పుల్లా కరుణాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాంటి వారిని పోలీసులు నిరంతరం గమనిస్తున్నారని, చట్ట ప్రకారం కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన చిత్రాలు, వీడియోలు పోస్టు చేయొద్దని, వ్యక్తిగత దూషణకు దిగడం, వార్నింగ్ ఇవ్వడం, అంతర్గత వివరాల గురించి అనవసర పోస్టులు, కామెంట్స్ పెట్టవదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, టెలీగ్రామ్, యూ ట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకొని తప్పుడు ప్రచారాలు చేయవద్దన్నారు. పోస్టులు చేసేటప్పుడు అప్రమత్తతో వ్యవహరించాలని, లేదంటే తగిన పర్యవసనాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని, అనవర పోస్టులు పెట్టి యువత తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు.

## లక్ష్మీ బరాజ్‌లో తగ్గిన వరద

**ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 1,08,500 క్యూసెక్కులు**

మహదేవపూర్, అక్టోబర్ 1 : మండలంలోని అంబట్‌పల్లి గ్రామంలో లక్ష్మీబరాజ్‌లో వరద ప్రవాహం తగ్గింది. ఆదివారం బరాజ్ ఇన్‌ఫ్లో 1,08,500 క్యూసెక్కుల వరద రాగ, బరాజ్‌లోని మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నట్లు భారీ నీటి పారుదలశాఖ డీఈఈ సురేశ్ తెలిపారు. బరాజ్ ప్రస్తుత నీటిమట్టం 2.90మీటర్లు ఉన్నదన్నారు.

# ఫొటో టెక్ ఎగ్జిబిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు చెన్నబోయిన లక్ష్మణ్
- ఎక్స్‌పో పోస్టర్ల ఆవిష్కరణ

గూడూరు, అక్టోబర్ 1: ఈ నెల 6 నుంచి 8 వరకు హైదరాబాద్‌లో జరిగే ఫొటోటెక్ ఎగ్జిబిషన్‌ను ఫొటోగ్రాఫర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు చెన్నబోయిన లక్ష్మణ్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో ఎగ్జిబిషన్‌కు సంబంధించిన పోస్టర్లను సీఐ ఫణిధర్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా ఫొటో, వీడియో గ్రాఫిక్‌లో అనేక మార్పులు, కొత్త సాంకేతిక పరిజ్ఞానం వస్తున్నాయన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫొటో, వీడియో గ్రాఫర్లు బాలచందర్, గిరి, సోము, వెంకట్, ప్రభాకర్, లాల్‌సింగ్, సాయి, సురేశ్, వేణు, నర్సింహ, ఆలీం, రమేశ్, కిరణ్, శ్రీనివాస్, శ్రీధర్, పాషా, సతీష్, నరేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**డోర్నకల్‌లో..**

డోర్నకల్ : ఈ నెల 6,7,8న హైదరాబాద్ ఎల్‌బీ నగర్ కేబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే ఎక్స్‌పో పోస్టర్లను ఆదివారం డోర్నకల్ ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం సభ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ముద్దం విజయ్‌భాస్కర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యాక్షుడు పోటు శేఖర్, కొలిపాక పుల్లారావు, మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు బీ సత్య నారాయణ, మండల ఉపాధ్యక్షుడు రవి, వీరబోయిన ఉపేందర్, సాయి, శ్రీనివాసరావు, రాము, శశికిరణ్, రవివర్మ, మోతీలాల్, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.


గూడూరు : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐ, ఫొటోగ్రాఫర్లు


డోర్నకల్ : ఎక్స్‌పో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు